సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం, 25, ఆగస్టు, 2022



డ్రమ్ సీడర్.. సాగు సూపర్

- వరి సాగులో శ్రమ, ఖర్చు ఆదా
- కూలీల కొరతను అధిగమించవచ్చు

సెంటర్‌స్ప్రెడ్‌లో..

రిజర్వ్ ఫారెస్ట్ వదిలి వస్తే సౌకర్యాలు కల్పిస్తాం

- జీలుగులోవ గ్రామస్తులతో ఉన్నతాధికారుల బృందం

8లో





సరకుల నాణ్యతలో తేడా ఉంటే చర్యలు

8లో

- శాంపిల్స్ ప్రకారమే నిత్యావసరాలు సరఫరా
- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశం

న్యూస్‌రీల్

రేపు సీఎం జగన్ విశాఖ రాక



మహారాణిపేట(విశాఖ దక్షిణ): రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 26న విశాఖ వస్తున్నారు. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 9.50 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. నేరుగా ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకొని పార్లె ఎగ్జిబిషన్ స్టాళ్లు, జీవీఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే బీచ్ క్లీనింగ్ ప్రొగ్రామ్ స్టాళ్లు, వీడియో గ్రఫీని తిలకిస్తారు. సీఎం సమక్షంలో ఏపీ ప్రభుత్వం, పార్లె ఫర్ ఓషన్స్ మధ్య ఎంవోయూ జరుగుతుంది. అనంతరం సీఎం ప్రసంగిస్తారు. 11.23 గంటలకు ఏయూ కాన్వొకేషన్ హాల్‌కు చేరుకుంటారు. అక్కడ జరిగే కార్యక్రమంలో గ్రాడ్యుయేట్లకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మైక్రోసాఫ్ట్ సంస్థ శిక్షణ ఇచ్చిన 5 వేల మందికి ధ్రువపత్రాలను అందజేస్తారు. అనంతరం వారినుద్దేశించి ప్రసంగిస్తారు. అక్కడ నుంచి బయలుదేరి 12.30 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 12.40 గంటలకు విమానంలో గన్నవరం బయలుదేరుతారు.

ప్రకృతికి ప్రణామం

- ఘనంగా జోల్డా పండగ
- పంచభూతాలకు గిరిజనుల పూజలు
- పంట భూముల వద్దే ఇంటిల్లిపాది విందు భోజనాలు



వరి పొలంలో కసిమి, నల్ల జోల్డా తదితర కొమ్మలను నాటుతున్న గిరిజన రైతు

సాక్షి,పాడేరు: పూర్వం నుంచి సంప్రదాయంగా వస్తున్న జోల్డా పండగను బుధవారం ఏజెన్సీ వ్యాప్తంగా పలు గ్రామాల్లో నిర్వహించారు. హుకుంపేట, పాడేరు, పెదబయలు, ముంచంగిపుట్టు, జి.మాడుగుల, డుంబ్రిగుడ, అరకులోయ మండలాల్లోని పలు గ్రామాల్లో ఈ పండగను ఘనంగా జరిపారు. ప్రకృతి దేవతలకు, పంచ భూతాలకు పూజలు చేయడం ఈ పండగలో ఆనవాయితీ. ఖరీఫ్ వరి నాట్లు పూర్తయిన తర్వాత గిరిజనులు తమ పంట భూముల్లో జోల్డా పండగను జరుపుకొంటారు. ఈ ఏడాది కూడా గ్రామాల్లో జోల్డా పండగ సందడి నెలకొంది.వచ్చే వారం మరిన్ని గ్రామాల్లో పండగ జరుపుతారు.

ప్రకృతి దేవతలకు పూజలు

పంటలు బాగా పండాలని, చీడపీడల బారి నుంచి కాపాడాలని ప్రకృతి దేవతలు, పంచభూతాలకు పూజలు చేయడం పండగ ప్రధాన ఉద్దేశం. జోల్డా పండగను పూర్వం నుంచి బుధవారం రోజు మాత్రమే ఈ సీజన్‌లో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పేద, ధనిక, వర్గాలకు అతీతంగా గిరిజనులు గ్రామాల్లో సందడి చేస్తుంటారు. వేకువజామునే స్నానం చేసి గ్రామదేవత శంకులమ్మతల్లికి పూజలు జరిపే గిరిజన పూజారి వద్ద అక్షింతల రూపంలో బియ్యం పొంది, వాటిని ఇతర బియ్యంతో కలిపి ఇంటి వద్ద వంట చేస్తారు. ప్రకృతి దేవతలతో పాటు పంచ భూతాలైన గాలి,నీరు, నిప్పు, భూమి, ఆకాశాలకు పూజలు చేయడం జోల్డా పండగలో ప్రధాన ఘట్టం.



అటవీ ప్రాంతం నుంచి సేకరించిన ఔషధ గుణాలున్న వృక్ష జాతుల కొమ్మలు

ఔషధ వృక్షాల కొమ్మల సేకరణ

పండగ సందర్భంగా గిరిజన రైతులు అటవీ ప్రాంతాల్లో దొరికే పలు రకాల ఔషధ వృక్షాల కొమ్మలను సేకరిస్తారు. ఔషధ గుణాలు అధికంగా ఉండడంతో పాటు పంటల్లో చీడ పీడల నివారణకు కూడా

మిగతా 2వ పేజీలో ▶

1 నుంచి 3 వరకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

- 2లో

వచ్చేనెల 1 నుంచి బయోమెట్రిక్ హాజరు

- అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అమలు
- కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి,పాడేరు : వచ్చేనెల 1వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరు అమలు చేయనున్నట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లాను ఏర్పాటు చేసిందని, అట్టడుగుస్థాయి గిరిజన జనాభా ఉన్నందున సక్రమంగా సేవలు అందించాల్సిన బాధ్యత జిల్లాలో అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులపై ఉందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఉద్యోగులందరి జీత భత్యాలు బయోమెట్రిక్ హాజరు ఆధారంగానే చెల్లించడం జరుగుతుందని తెలిపారు. కార్యనిర్వాహక అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయి పర్యటనను మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని, దాన్ని సంబంధిత పైఅధికారి అటెస్ట్ చేయాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న జిల్లా, డివిజన్‌స్థాయి అధికారులు, సిబ్బంది ప్రతిరోజు 10గంటలకు వారి కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరు నమోదు చేసుకోవాలని, బయోమెట్రిక్ పరికరం లేని వారు కలెక్టర్ కార్యాలయంలో ఉన్న బయోమెట్రిక్ పరికరం ద్వారా హాజరు నమోదు చేసుకోవాలని ఆదేశించారు.

విధుల్లో నిర్లక్ష్యం సహించం

2లో



వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

క్లుప్తంగా...

పీఎం యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తులు

సాక్షి, పాడేరు : పీఎం యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్‌కు అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో డాక్టర్ రమేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం రూ.2.50 లక్షలు మించకుండా ఉన్న 9 నుంచి 11వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 26వ తేదీలోపు హెచ్‌టీటీపీఎస్://వైఇటీ.ఎన్‌టీఏ.ఎసి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, సెప్టెంబర్ 11న విద్యార్థులకు పరీక్ష జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఎకో టూరిజం ప్రాజెక్టు స్థలం పరిశీలన



ఎకో టూరిజం స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ

అనంతగిరి: భీంపోల్ పంచాయతీ నందకోట రెవెన్యూ రాళ్లగెడ్డ గ్రామ సమీపంలోగల 22, 28 సర్వేనంబర్లలోని ఎకో టూరిజం ప్రాజెక్టు కేటాయించనున్న కొండపోరంబోకు స్థలాన్ని బుధవారం జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ పరిశీలించారు.ఈ స్థలం కోసం పర్యాటకశాఖ దరఖాస్తు చేసింది. గెడ్డలను దాటుకుంటూ వెళ్లి స్థలాన్ని పరిశీలించడంతో పాటు ప్రాజెక్టుపై స్థానికుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. గ్రామసభ ఏర్పాటు చేసి, ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఏ ప్రాజెక్టులు నిర్మించాలన్నా పంచాయతీల అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. అనంతరం అనంతగిరి సచివాలయాన్ని తనిఖీ చేశారు. స్పందన నిర్వహిస్తున్నారా లేదా అని అడిగితెలుసుకున్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేవిధంగా సిబ్బంది పనిచేయాలన్నారు. రెవెన్యూ కార్యాలయంలోని వీఆర్వోలు, సిబ్బందితో కలిసి సమావేశమయ్యారు. తహసీల్దార్ రాంబాయి పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం సహించం

- వైద్యులు, సిబ్బంది హెడ్‌క్వార్టర్‌లోనే మకాం ఉండాలి
- కలెక్టర్ సుమిత్ కుమార్



ఐసీడీఎస్ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: వైద్య సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది ఆయా హెడ్‌క్వార్టర్లలోనే మకాం ఉండి రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని అన్ని పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బందితో వైద్యఆరోగ్య కార్యక్రమాలపై బుధవారం ఆయన సమీక్షించారు. వైద్య ఆరోగ్యశాఖకు చెందిన సేవల పోర్టల్‌లో నమోదు చేసిన పలు రిపోర్టులపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు వారాల్లో మళ్లీ సమీక్ష నిర్వహిస్తానని, అన్ని సేవల నమోదు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాలను వైద్యులు సందర్శించి సేవలు అందించాలని, అవసరమైన చోట ప్రత్యేక వైద్యశిబిరాలను నిర్వహించాలని సూచించారు. గ్రామ సందర్శనల ద్వారా గుర్తించిన గర్భిణులకు చేసే నెలవారీ వైద్య పరీక్షలతో పాటు వారి వివరాలను ఎంసీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. నెలలు నిండిన గర్భిణులను ముందుగానే ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి, సుఖ ప్రసవాలకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం నిమిత్తం అందించే నగదు వివరాలను కూడా పోర్టల్‌లో నమోదు చేసి, పంపిణీ వేగవంతం చేయాలన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది ప్రతిరోజు బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సుజాత, ఏడీ ఎంహెచ్‌వో డాక్టర్ కె.లీలా ప్రసాద్, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ టి.విశ్వేశ్వరనాయుడు, డీఐవో డాక్టర్ ప్రభావతి, 36 ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నివారణకు చర్యలు

మాతాశిశు మరణాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. ఐసీడీఎస్ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్ ద్వారా అందించే అన్ని సేవలు సంబంధిత యాప్‌లలో అప్‌లోడ్ చేయాలని, జిల్లా డ్యాష్‌బోర్డులో ప్రకటించాలని సూచించారు. సిగ్నల్ సమస్య ఉంటే ఆఫ్‌లైన్‌లో నమోదు చేసి, సిగ్నల్ ఉన్న దగ్గర ఆన్‌లైన్ చేయాలన్నారు. జిల్లాలో 20 నుంచి 25శాతం మంది పిల్లలకు ఇమ్యునైజేషన్ జరగడం లేదని, వారిని గుర్తించి వ్యాధి నిరోధక మందులు అందజేయాలని ఆదేశించారు. రక్తహీనత ఉన్న తల్లీబిడ్డలను గుర్తించి, వైద్య సేవలందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సీడీపీవోలు,సూపర్‌వైజర్లు ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించాలని, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బందితో సమావేశాలు కూడా నిర్వహించాలన్నారు. గర్భిణుల వివరాలు, ఫోన్ నంబర్లను ప్రతి సీడీపీవో నమోదు చేసుకుని, వారికి అన్ని విధాల సలహాలు,సూచనలు ఇవ్వాలన్నారు. రక్తహీనత నివారణ, సంక్షేమ కార్యక్రమాల్లో సచివాలయ మహిళా పోలీసులు స్పందించడం లేదని సీడీపీవోలు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే ఎస్పీ సతీష్‌కుమార్‌తో మాట్లాడి అన్ని సచివాలయాల మహిళా పోలీసులకు సర్క్యులర్ పంపించాలని సూచించారు. జిల్లాలో 131 అంగన్‌వాడీ కేంద్రాలను నాడు–నేడు కింద అభివృద్ధి చేస్తున్నామని, కమిటీ సభ్యుల వివరాలు అప్‌డేట్ చేసి బ్యాంకుల్లో ఖాతాలు తెరిపించాలని కలెక్టర్ సూచించారు. హుకుంపేట ప్రాజెక్టు పరిధిలో నాణ్యమైన సరకులు పంపిణీ కావడం లేదని సీడీపీవో కలెక్టర్ దృష్టికి తీసుకురాగా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంట్రాక్టర్‌లంతా గురువారం తన వద్ద హాజరు కావాలని ఆదేశించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి, సీడీపీవోలు పాల్గొన్నారు.

ప్రకృతికి ప్రణామం

▶ 1వ పేజీ తరువాయి

దోహదం చేసే కసిమి, నల్ల జోల్దా, చీడి కొమ్మ, సీత, మంగ, జంతరంగి(జీలుగ) కొమ్మలను సేకరిస్తారు. ప్రతి గిరిజనుడు పై కొమ్మలను సేకరించి, కుటుంబ సమేతంగా పంట భూముల వద్దకు తీసుకువెళ్లి పూజలు జరిపి, నాటుతారు. ఈ కొమ్మలు నాటడం ద్వారా చీడపీడల నివారణతో పాటు ఆ కొమ్మలపై పిట్టలు వాలి క్రిమికీటకాలను నాశనం చేస్తాయని గిరిజన రైతుల నమ్మకం

పొలాల వద్దే విందు భోజనాలు

జోల్దా పండగను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్న గిరిజనులంతా కుటుంబ సమేతంగా పంట భూముల వద్దే విందు భోజనాలు చేస్తారు. అడ్డాకుల డొప్పల్లో ఆహారపదార్థాలు తిని ఆ ఎంగిలి ఆకులను పంట భూముల్లో పారవేయడం కూడా ఈ జోల్దా పండగలో ఆచారం.

పంటలు బాగా పండాలని..



చీడపీడల నివారణతో పాటు పంటలు బాగా పండాలని జోల్దా పండగను ప్రతి ఏడాది ఘనంగా జరుపుకొంటాం. ఔషధ గుణాలున్న కసిమి, నల్ల జోల్దా, చీడి, సీత, మంగ, జంతరంగి కొమ్మలను అడవుల్లో సేకరించి వాటికి ప్రత్యేక పూజలు జరిపి పంట భూముల్లోనే నాటడం పూర్వం నుంచి వస్తున్న ఆనవాయితీ. పంటలు బాగా పండాలనే ఖరీఫ్ నాట్లు పూర్తయిన తర్వాత జోల్దా పండగను ఘనంగా జరుపుతాం. పంట భూముల్లోనే భోజనాలు చేసి ఎంగిలి ఆకులను పంట భూముల్లో పారేస్తాం.

– తమర్భ చిన్నమ్మి, సన్యాసమ్మపాలెం, హుకుంపేట మండలం

1 నుంచి 3 వరకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

చింతూరు: వర్షాలు, వరదలు కారణంగా వాయిదా పడిన పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరులో నిర్వహించాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ దేవేంద్రరెడ్డి బుధవారం ఉత్తర్వులిచ్చారు. జూలైలో నిర్వహించిన అడ్వాన్స్‌డ్ పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ పరీక్షలను వర్షాలు, వరదల కారణంగా చింతూరు, కూనవరం, వీఆర్ పురం, ఎటపాక మండలాలకు చెందిన 126 మంది విద్యార్థులు రాయలేకపోయారు. వీరికి ఆ పరీక్షలను గురుకుల పాఠశాలలో నిర్వహించనున్నారు.

నాణ్యమైన సత్వర సేవలే ధ్యేయం

- విద్యుత్ ప్రమాదాలకు బాధ్యులైన అధికారులపై చర్యలు
- శతశాతం విద్యుత్ బకాయి వసూళ్లపై దృష్టి పెట్టాలి
- సెప్టెంబర్ 10లోగా బకాయిలు చెల్లించే ప్రభుత్వ శాఖలకు సర్‌చార్జీ రద్దు
- జగనన్న కాలనీల్లో త్వరితగతిన విద్యుదీకరణ పనులు
- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు



సమీక్షలో మాట్లాడుతున్న ఏపీఈపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

దొండపర్తి(విశాఖ దక్షిణ): విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, సత్వర సేవలందించడమే విద్యుత్ సంస్థల ధ్యేయమని.. అందుకనుగుణంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీఈపీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు సంస్థ అధికారులకు సూచించారు. విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం సంస్థ డైరెక్టర్లు, సీజీఎంలు, జీఎంలు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిళ్ల ఎస్‌ఈలు, ఈఈలు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఈఆర్సీ నిర్దేశించిన ఎస్‌ఓపీ(స్టాండర్డ్స్ ఆఫ్ పెర్ఫార్మెన్స్) ప్రమాణాలకు అనుగుణంగా విద్యుత్ వినియోగదారులకు త్వరితగతిన మెరుగైన సేవలందించేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. విద్యుత్ వినియోగదారులకు నిర్దిష్ట కాలపరిమితిలో సేవలందించడంలో అలసత్వం ప్రదర్శించే అధికారులకు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. విద్యుత్ ప్రమాదాల నివారణ చర్యలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని, సిబ్బందికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. విద్యుత్ ప్రమాదాలకు బాధ్యులైన అధికారులపై విచారణ అనంతరం తీవ్ర చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు క్షేత్రస్థాయిలో విద్యుత్ వ్యవస్థను పటిష్టవంతం చేయాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ పంపిణీ నష్టాలను తగ్గించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ బకాయిలను 100 శాతం వసూలు చేసేందుకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఆగస్టు వరకు పేరుకుపోయిన వివిధ ప్రభుత్వ సర్వీసుల బకాయిల మొత్తాలను సెప్టెంబర్ 10వ తేదీలోపు చెల్లించిన ప్రభుత్వ శాఖలకు, మున్సిపాలిటీలకు, పంచాయతీలకు ఏపీఈఆర్సీ నిబంధనలకు అనుగుణంగా సర్‌చార్జీ రద్దు చేస్తామని పేర్కొన్నారు. జగనన్న కాలనీల్లో విద్యుదీకరణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. సంస్థ పరిధిలో వ్యవసాయ విద్యుత్ సర్వీసులను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారానికి వినియోగదారులు టోల్ ఫ్రీ నెంబర్ 1912కు గానీ, వాట్సాప్ నెంబరు 8500001912కు సందేశం పంపించడం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ అంశంపై వినియోగదారుల్లో అవగాహనను పెంపొందించేందుకు తగిన ప్రాచుర్యం కల్పించేందుకు సిబ్బంది మరింత కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్ బి.రమేష్ ప్రసాద్, డైరెక్టర్ ఫైనాన్స్ డి.చంద్రం, సీజీఎంలు వి.విజయలలిత, డి.సుమన్ కల్యాణి, జి.చిరంజీవిరావు, సి.శ్రీనివాసమూర్తి, ఎస్.మసిలామని, బి.రామచంద్రప్రసాద్, జె.శ్రీనివాసరావు, ఎ.వి.వి.సూర్యప్రతాప్, ఎ.వెంకటేశ్వరరావు, ఎం.రవీంద్ర, అయిదు సర్కిళ్ల అధికారులు పాల్గొన్నారు.

వాగులో కొట్టుకుపోయిన ఆటో

- ప్రయాణికులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన పోలీసులు

రాజవొమ్మంగి : రాజవొమ్మంగి నుంచి లాగరాయి ప్రయాణికులతో వెళుతున్న ఆటో మార్గమధ్యంలో నెల్లిమెట్ల వద్ద పొంగి ప్రవహిస్తున్న చిన్నేరు వాగులో కొట్టుకొని పోయింది. సకాలంలో స్థానికులు స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. బుధవారం సాయంకాలం జరిగిన ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురిని స్థానిక ఎస్‌ఐ గోపీ నరేంద్రప్రసాద్ నేతృత్వంలో పోలీసు సిబ్బంది, స్థానిక యువకులు, ఆటో డ్రైవర్లు కలిసి సురక్షితంగా ఒడ్డుకు చేర్చి ప్రాణాపాయం నుంచి కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాజవొమ్మంగికి చెందిన ఆటో యూనియన్ అధ్యక్షుడు భవానీ తన ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకొని రాజవొమ్మంగి నుంచి లాగరాయి వెళుతుండగా నెల్లిమెట్ల వద్ద వాగు దాటే ప్రయత్నం చేశాడు. ఉన్నట్టుండి వాగు ఉధృతి ఒక్కసారిగా పెరగడంతో ఆటో క్రమేపీ వరద నీటిలో దిగువకు కొట్టుకొని పోయింది. శరభవరం పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ బొడ్డు భవానీ పాఠశాల ముగిసిన తరువాత స్వగ్రామం లాగరాయి వెళ్లడానికి ఈ ఆటో ఎక్కింది. అదే ఆటోలో తీగల సత్యవతి, రామచంద్రరావు అనే వృద్ధ దంపతులతో పాటు రాజవొమ్మంగికి చెందిన అంగన్‌వాడీ టీచర్ బేబీ కూడా ప్రయాణిస్తున్నారు. వరదలో కొట్టుపోతూ బిగ్గరగా కేకలు పెట్టడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. విషయం రాజవొమ్మంగి పోలీసులకు తెలపడంతో వారు అక్కడకు చేరి తాళ్లతో వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ప్రమాదంలో ప్రయాణికులకు చెందిన సెల్‌ఫోన్‌లు, నిత్యావసర వస్తువులు, కొంత నగదు వాగులో కొట్టుకొని పోయాయి. తంటికొండ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ భవానీ కూడా ఈ ప్రమాదం నుంచి బయటపడ్డాడు. వరద ఉధృతి తగ్గితే కాని ఆటోను బయటకు తీయడం వీలుపడదని ఎస్‌ఐ గోపీ నరేంద్రప్రసాద్ అన్నారు. ప్రయాణికులకు ప్రథమ చికిత్స అందజేసి వారి గమ్యస్థానాలకు చేర్చారు. సీఐ రవికుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సహాయక కార్యక్రమాల్లో పోలీసులు సూరిబాబు, రాజవొమ్మంగి, జడ్డంగి స్టేషన్లకు చెందిన పోలీసులు కొండబాబు, ప్రసాద్, సాయినాథ్, కిషోర్ పాల్గొన్నారు.


చిన్నేరు వాగులో ఆటోతో పాటు కొట్టుకు పోతున్న ప్రయాణికులు

క్లుప్తంగా...

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ప్రమాదంలో మృతి చెందిన ధనుంజయరామునాయుడు

మాకవరపాలెం : బస్సు–బైక్ ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందాడు. నర్సీపట్నం మండలం చెట్టుపల్లికి చెందిన వేపాడ ధనుంజయ రామునాయుడు(21) బైక్‌పై బుధవారం మధ్యాహ్నం యలమంచిలి వెళుతుండగా మాకవరపాలెం మండలంలో ఉన్న అన్‌రాక్ రిఫైనరీ మెయిన్‌గేట్ సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న నాన్‌స్టాప్ బస్సు–బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ధనుంజయ రామునాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై సమాచారం అందిన ఎస్‌ఐ రామకృష్ణారావు ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

120 కిలోల గంజాయితో ఒకరి అరెస్టు


స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

చింతపల్లి రూరల్ : తాజంగి నుండి వంజరి రోడ్డు మార్గంలో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా కారులో 120 కేజీల గంజాయి పట్టుబడింది. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తుల్లో ఒకరిని అదుపులోకి తీసుకోగా, మరొకరు పరారయ్యారు. గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎక్సైజ్ ఎస్‌ఐ ఇబ్రహీం అన్నారు. గంజాయి విలువ సుమారు రూ.2.40 లక్షలు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాడేరు డీటీఎఫ్ సీఐ కూర్మారావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

అర్చకుని అదృశ్యంపై కేసు నమోదు

కశింకోట : కశింకోటలో అర్చకుని అదృశ్యంపై బుధవారం కేసు నమోదు చేశామని హెచ్‌సీ టి.అప్పలకొండ తెలిపారు. స్థానిక శివాలయానికి చెందిన అర్చకుడు వెలవలపల్లి వెంకట సూర్యకృష్ణమూర్తి(43) మంగళవారం ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదని చెప్పారు. ఆచూకీ తెలియకపోవడంతో సోదరుడు చితంబరం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

పెట్రోల్‌బంక్ సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తులు అరెస్టు

నర్సీపట్నం : పెట్రోల్ బంక్ సిబ్బందిపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని టౌన్ ఎస్‌ఐ దివాకర్ యాదవ్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని శారదానగర్‌లోని పెట్రోల్ బంక్ సిబ్బంది గొర్లి గోవింద్, కాశీలను ఈ నెల 21వ తేదీ అర్ధరాత్రి సమయంలో పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మద్యం మత్తులో దాడి చేశారని తెలిపారు. బంక్ సిబ్బంది ఫిర్యాదు మేరకు దాడి చేసిన బి.సాయి కార్తీక్, పి.చైతన్య, అబ్దుల్ రహీంను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

సీఎం దృష్టికి తీసుకెళ్లి రొయ్యల కంపెనీని తెరిపిస్తాం

మాజీ ఎమ్మెల్యే చెంగల


విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చెంగల

నక్కపల్లి : ధర్మవరంలో ఉన్న కోస్టల్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ వ్యవహారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తెరిపించేందుకు కృషి చేస్తామని పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు తెలిపారు. బుధవారం ఆయన అడ్డురోడ్డులో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కంపెనీ మూసివేతకు అధికారపార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులే కారణమంటూ ప్రతిపక్ష టీడీపీ నాయకులు ఆరోపించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీలో ఏమైనా లోటు పాట్లు ఉంటే సరి చేయాలని, ప్రజా జీవనానికి కాలుష్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఏ పార్టీనేతలైనా ఉన్నతాధికారులను కోరడం సహజమన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా కంపెనీ మూసివేతకు అధికార పార్టీనాయకులు కారణమని ఆరోపిస్తూ బాధిత కుటుంబాలతో రాజకీయం చేయాలని ప్రయత్నించడం టీడీపీ నాయకులకు తగదన్నారు. ఈనెల 26న విశాఖ వస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని తమ ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, మండల స్థాయి నేతలతో కలిసి కంపెనీని తిరిగి తెరిపించి 1500 కుటుంబాలకు ఉపాధి పునరుద్ధరించాలని కోరడం జరుగుతుందన్నారు. గత టీడీపీ హయాంలో మీరు ఏయే కంపెనీలను బెదిరించారో, ఎక్కడెక్కడ దండుకున్నారో తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. బాధిత కుటుంబాలను రాజకీయంగా వాడుకోవాలని చూడొద్దన్నారు. పార్టీలకతీతంగా కంపెనీని తెరిపించేందుకు సహకరించాలన్నారు. పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పనపై తమ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందన్నారు. దివంగత నేత వైఎస్సార్ హయాంలో పాయకరావుపేట నియోజకవర్గంలో రెండు పెద్ద కంపెనీలను ప్రోత్సహించడం వల్లే దాదాపు 25వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించిందని అన్నారు.

విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి


మృతి చెందిన పాడిగేదె

రావికమతం : కొత్తకోట జగనన్న కాలనీలో విద్యుత్ షాక్‌కు గురై పాడి గేదె బుధవారం మృతి చెందింది. కాలనీలో కొన్ని రోజులుగా విద్యుత్ లైన్లు వేస్తున్నారు. బుధవారం కురిసిన భారీ వర్షానికి ఒక స్తంభానికి అమర్చిన ఎర్త్‌వైర్‌కు విద్యుత్ సరఫరా అయ్యింది. ఆ సమయంలో దిబ్బలపాలేనికి చెందిన చందక రామకృష్ణ పశువులు మేపుతుండగా అతని పాడి గేదె పచ్చిక మేస్తూ ఆ వైరుకు తాకడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఇటీవలే రూ.80 వేలకు కొన్నానని, గేదె మృతితో జీవనోపాధి కోల్పోయానని ఆ రైతు కన్నీరు మున్నీరుగా విలపించాడు. తనకు సహాయం అందించాలని కోరుతున్నాడు.

ప్రేమజంటను విడదీసిన విధి

- రోడ్డు ప్రమాదంలో ప్రియుడి మృతి
- ఆస్పత్రిపాలైన యువతి


ప్రమాదంలో మృతి చెందిన పోతురాజు (ఫైల్)


గాయాలపాలైన మెర్సీ


ఘటనాస్థలంలో పోతురాజు మృతదేహం

హనుమాన్ జంక్షన్ రూరల్ (గన్నవరం): బాపులపాడు మండలం వీరవల్లి వద్ద బైక్‌పై వెళ్తున్న ప్రేమజంట రోడ్డు ప్రమాదానికి గురైంది. 16వ నంబరు జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా, యువతి తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలైంది. పోలీసుల కథనం మేరకు.. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం చెరువూరుకు చెందిన సారపు పోతురాజు, గుంటూరు జిల్లా తెనాలికి చెందిన మెర్సీ కొంతకాలంగా ఓ స్పిన్నింగ్ మిల్లులో కార్మికులుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి మధ్య ప్రేమ చిగురించింది. తమ ప్రేమ విషయాన్ని ఇద్దరూ తమ పెద్దలకు చెప్పగా వారు అంగీకరించలేదు. ఈ నెల 19వ తేదీన మెర్సీకి వేరే యువకుడితో వివాహం చేసేందుకు ఆమె కుటుంబ సభ్యులు నిర్ణయించారు. దీంతో 18వ తేదీనే మెర్సీ, పోతురాజు తమ ఇళ్ల నుంచి పరారయ్యారు. ఈ నేపథ్యంలో మెర్సీ అదృశ్యమైందని ఆమె తల్లిదండ్రులు తెనాలి టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మెర్సీ, పోతురాజుతో కలిసి అతని స్వగ్రామమైన రంపచోడవరం మండలం చెరువూరులో ఉన్నట్లుగా గుర్తించారు. విచారణ నిమిత్తం తెనాలి టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు రావాల్సిందిగా ప్రేమికులకు పోలీసులు సూచించారు. దీంతో పోతురాజు, మెర్సీ బైక్‌పై తెనాలి బయలుదేరారు. వీరవల్లి సమీపంలో జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదకు రాగానే పోతురాజు సెల్‌ఫోన్ మోగింది. అతను బైక్ నడుపుతూనే ఫోన్ మాట్లాడేందుకు ప్రయత్నించాడు. బైక్ అదుపుతప్పి వంతెన సైడ్ వాల్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రేమికులు ఇద్దరూ ఎగిరి ఫ్లైఓవర్ బ్రిడ్జి పై నుంచి కింద ఉన్న సర్వీసు రోడ్డుపై పడ్డారు. తీవ్ర రక్తస్రావంతో పోతురాజు అక్కడికక్కడే మృతిచెందాడు. మెర్సీ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సమాచారం అందుకున్న వీరవల్లి ఏఎస్‌ఐ వై.ఆంజనేయులు, హైవే రోడ్ సేఫ్టీ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. మెర్సీని హుటాహుటిన విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన వ్యక్తి

అరకులోయ రూరల్ : అరకులోయ రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు ఢీకొని గుర్తు తెలియని సుమారు 60 ఏళ్ల గల ఓ వృద్ధుడు మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఆర్‌పీఎఫ్, ఏఎస్‌ఐ మోహన్‌తో పాటు రైల్వే శాఖ జీఆర్‌పీ పోలీసులు బుధవారం సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అరకులోయ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీకి మృతదేహం తరలించినట్టు ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ మోహన్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బాలికను వేధించిన యువకుడిపై కేసు నమోదు

నర్సీపట్నం : మైనర్ బాలికను వేధించిన యువకుడిపై కేసు నమోదు చేశామని టౌన్ దివాకర్ యాదవ్ తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం. మున్సిపాలిటీ పరిధి శారదనగర్‌లో మైనర్ బాలిక తల్లిదండ్రులతో నివాసం ఉంటుంది. వేములపూడి మోడల్ స్కూల్లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. ప్రతి రోజూ, ఉదయం సాయంత్రం ఆర్టీసీ కాంప్లెక్స్ వచ్చి బస్సులో కాలేజీకి వెళ్తుంది. ఈ సమయంలో మున్సిపాలిటీ బలిఘట్టంకు చెందిన కొమ్మనాపల్లి దుర్గ(19) అనే యువకుడు అమ్మాయిని వేధింపులకు గురి చేస్తున్నాడు. అమ్మాయి విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో తల్లిదండ్రులు టౌన్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో చట్టం, ఐపీసీ 363, 354–ఎ, 354–డి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్రపతి ముర్మును కలిసిన ఆదివాసీ నేతలు

గిరిజనుల సమస్యలపై వినతి



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో అఖిలభారత ఆదివాసీ వికాస పరిషత్ నేతలు

సాక్షి, పాడేరు: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును అఖిల భారత ఆదివాసీ వికాస పరిషత్ జాతీయ అధ్యక్షుడు సోమ్జీ భాయ్ దామోర్ ఆధ్వర్యంలో ఏపీకి చెందిన నేతలంతా మంగళవారం సాయంత్రం కలిశారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణ, సంక్షేమ పథకాల అమలులో గిరిజనులకు ప్రాధాన్యత, జీవో నంబర్–3 కొనసాగింపు, 1/70 భూబదలాయింపు చట్టం పకడ్బందీగా అమలు తదితర విషయాలను విన్నవించారు. జాతీయ రహదారి నిర్మాణానికి బైపాస్ రోడ్ల నిర్మాణంతో గిరిజనుల పంట భూములను కోల్పోతారని, తదితర అంశాలను రాష్ట్రపతి దృష్టికి నేతలు తీసుకువెళ్లారు. దేశంలోని పలు రాష్ట్రాల ఆదివాసీ వికాస పరిషత్ నాయకులతో పాటు రాష్ట్ర అధ్యక్షుడు అడపా బొంజు నాయుడు, జాతీయ కార్యవర్గ సభ్యులు సింహాచలం, అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షుడు బూడిదే చిట్టిబాబు తదితరులున్నారు.

గ్రామ సచివాలయాల్లో ఈ–శ్రమ్ నమోదు

జిల్లా కార్మికశాఖ అధికారి సుజాత



సాక్షి,పాడేరు: అసంఘటిత రంగ కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న ఈ–శ్రమ్ ప్రమాద బీమాను అందరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కార్మికశాఖ అధికారి సుజాత కోరారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఈ–శ్రమ్ నమోదు సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. ఈ–శ్రమ్ గుర్తింపు కార్డు పొందేందుకు తప్పనిసరిగా ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ, వ్యవసాయ కూలీలు, భవన, నిర్మాణ రంగ కార్మికులు, వెల్డింగ్ వర్కర్లు, ఎలక్ట్రిషియన్లు, గృహాల్లో పనిచేసేవారు, ఆటో, కారు డ్రైవర్లు, ఆశ, అంగన్‌డీ వర్కర్లు, ఆయాలు, చేనేత, కమ్మరి, తోపుడు బండ్ల వ్యాపారులు, కొరియర్ బాయ్స్, టైలర్లు, దినసరి వేతన కార్మికులు నమోదు చేసుకోవచ్చన్నారు. ఈఎస్ఐ, ఈపీఎఫ్ సదుపాయం లేని వారు ఈ బీమా సౌకర్యం పొందేందుకు అర్హులని తెలిపారు. గ్రామ సచివాలయాల్లో ఈ–శ్రమ్ నమోదు కోసం అర్హులైన వారు ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్, నామినీ వివరాలతో సంప్రదించాలని ఆమె సూచించారు. ఈ–శ్రమ్ గుర్తింపు కార్డు పొందడం ద్వారా రూ.2లక్షల ప్రమాద బీమాతో పాటు వృత్తి శిక్షణ, సంక్షేమ పథకాలు అమలు, ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల సమయంలో ప్రభుత్వ సాయం, అసంఘటిత కార్మికుల సామాజిక భద్రత కోసం ప్రభుత్వం అందించే సాయం అమలవుతుందని, డైరెక్టుగా బ్యాంకు ట్రాన్స్‌ఫర్ ద్వారా నామినీ అకౌంట్‌కు జమ అవుతుందన్నారు. ఈ–శ్రమ్‌లో నమోదు చేసుకున్న 18 నుంచి 40ఏళ్లలోపు అసంఘటిత కార్మికులకు పీఎంఎస్‌వై మాన్‌ధన్ పథకం ద్వారా 60 ఏళ్ల తర్వాత ప్రతినెల రూ.3వేలు చొప్పున జీవితాంతం పింఛన్ సౌకర్యం పొందవచ్చని ఆమె తెలిపారు.

పాలిథిన్ కవర్లు స్వాధీనం: రూ.10వేలు జరిమానా



వ్యాపారుల నుంచి స్వాధీనం చేసుకున్న పాలిథిన్ కవర్లు

ముంచంగిపుట్టు: దుకాణాలకు ప్లాస్టిక్ కవర్లను అమ్మేందుకు చోడవరం నుంచి వ్యక్తితో పాటుగా కొనుగోలు చేస్తున్న వ్యక్తికి పంచాయతీ కార్యదర్శి గోపి రూ.10వేలు జరిమానా విధించారు. చోడవరం నుంచి వచ్చిన ఓ వ్యాపారి ప్లాస్టిక్ కవర్లను అమ్మేందుకు మండల కేంద్రానికి బుధవారం వచ్చాడు. విషయం తెలుసుకున్న స్థానిక వర్తక సంఘం వ్యాపారులు వాటిని స్వాధీనం చేసుకొని, పంచాయతీకి కార్యదర్శికి సమాచారం అందించారు. తహసీల్దార్ నర్సమ్మ, ఎంపీడీవో కుమార్, ఎస్ఐ రవీంద్ర సమక్షంలోని చోడవడం నుంచి వచ్చిన వ్యాపారికి రూ.6,200, కొనుగోలు చేస్తున్న వ్యక్తి రూ.3,800 జరిమానా విధించారు. ప్లాస్టిక్ నిషేదించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపడుతుందన్నారు. దీనిని వ్యాపారులు పరిగణంలోకి తీసుకుని, ప్లాస్టిక్‌ను నిషేదించాలని అవగాహన కల్పించారు.

సబ్ కలెక్టర్ దృష్టికి రైతుల సమస్యలు



సబ్ కలెక్టర్ అభిషేక్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పాడేరు రూరల్: ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం పట్టా భూములు కలిగిన గిరిజనుల రైతుల నుంచి సేకరించనున్న స్థలాల విషయంలో ఆయా రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కేంద్ర ఫిలిం సెన్సర్ బోర్డు సభ్యుడు, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు సల్లా రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బాధిత రైతులతో కలిసి పాడేరు సబ్ కలెక్టర్ వి.అభిషేక్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. పాడేరు మండలం గొందూరు గ్రామంలో కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయాల నిర్మాణాల కోసం సుమారు 12 మంది గిరిజన రైతులకు చెందిన పట్టా భూములు సేకరిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ మేరకు సాగు భూములను నష్టపోతున్న గిరిజన రైతులకు తగిన పరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. సమస్యను పరిష్కరించిన తర్వాతే భూములను సేకరించాలన్నారు. సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన వారిలో రైతులు రామకృష్ణ, బాలన్న, అప్పలకొండ, రాము, పార్వతమ్మ, ధనలక్ష్మి, లక్ష్మి, రెడ్డి ఎంకులమ్మ తదితరులున్నారు.

నేడు జాబ్‌మేళా

అరకులోయ: వరుణ్ మోటార్స్‌లో ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.రోషిణి బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, స్కిల్డ్ మెకానిక్స్,సూపర్‌వైజర్ తదితర పోస్టులకు సంబంధించి 115 ఖాళీలు ఉన్నాయని, 18 నుంచి 45ఏళ్లలోపు నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. టెన్త్, డిగ్రీ, డిప్లమో, ఐటీఐ, బీటెక్ విద్యార్హత గల వారు ఈ పోస్టులకు అర్హులని, జాబ్‌మేళాకు ఎంపికైన అభ్యర్థులకు కనీస వేతనం రూ.10వేలు, ఇన్సెంటివ్స్‌తో అరకు, పాడేరు, నర్సీపట్నం, ముంచంగిపుట్టు, చోడవరం, కోటపాడు, మాకవరపాలెం తదితర ప్రాంతాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 7993795796, 9398338105 నంబర్లలో సంప్రదించాలని, ఆసక్తి గల వారు నేరుగా జాబ్‌మేళాకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10గంటలకు హాజరు కావాలని ఆమె కోరారు.

క్లుప్తంగా...

ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాల పంపిణీ



పట్టాలు అందజేస్తున్న వైస్ ఎంపీపీ సుమాంజలి

అరకులోయ రూరల్: సుంకరమెట్ట పంచాయతీ దండబాబు, కె.బెడ్డగుడ, నిమ్మగుడ, దోబురంగిని గ్రామాలకు చెందిన 80 మంది లబ్ధిదారులకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలను వైస్ ఎంపీపీ సుమాంజలి బుధవారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనులకు పోడు భూములపై హక్కులు కల్పించి పత్రాలు అందజేయడం చరిత్రాత్మకమన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ చిన్నబాబు, వీఆర్వో అమ్మలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో నవీన్, పక్కన ఎంపీపీ

పాడేరు రూరల్ : మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ సొనారి రత్నకుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. అమలవుతున్న పథకాలపై అధికారులు సభ్యులకు వివరించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్య, వైద్య శిబిరాల ఏర్పాటు, మూగజీవాలకు వ్యాక్సినేషన్ల అంశాలను సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో అధికారుల పర్యటనపై సర్పంచ్, ఎంపీటీసీ, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎంపీపీ రత్నకుమారి మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సర్వసభ్య సమావేశాలకు గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపీడీవో సాయి నవీన్ స్పష్టం చేశారు. స్థలాల ఆక్రమణపై చర్యలు తీసుకుంటామని, శిథిల నివాస గృహాలకు మరమ్మతు చేస్తామన్నారు. సభ్యులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఎమ్మెల్యే పాల్గుణ పరామర్శ



ప్రమాదంలో గాయపడిన ఉపాధ్యాయుడిని పరామర్శిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: రోడ్డు ప్రమాదంలో గాయాలైన పెదబయలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల–2 ఉపాధ్యాయుడు తలమారి చిరంజీవి ఇంటికి వెళ్లి అరకు ఎమ్మెల్యే పాల్గుణ బుధవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పాడేరు వైద్యాధికారులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. సి.కాలనీలో ఆయన పర్యటించి, స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో నిధులు మంజూరు చేసి పనులు చేస్తామన్నారు. జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, మండల పార్టీ అధ్యక్షుడు ఆనందరావు, నాయకులు సూరయ్య, మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణ, సర్పంచ్ వెంకటరమణ, నాయకులు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



పరదేశిపాకలలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, పక్కన ఎంపీపీ, నేతలు

కొయ్యూరు: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని పరదేశిపాకలు, బంగారంపేట, పాత బంగారంపేట గ్రామాల్లో భారీ వర్షంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో 209 గడపలను సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ఆయా గ్రామస్తులు మాట్లాడుతూ సకాలంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని, మరలా జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గిరిజనులందరికీ ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు మంజూరుకానున్నట్టు చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా పథకాలు అమలుచేస్తున్నారన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు నూకరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి, సర్పంచ్‌లు పెంటమ్మ, సోమన్నదొర, రాజకుమారి, చందు, ఎంపీటీసీ అప్పారావు, నాయకులు సత్యనారాయణ, రాజులమ్మ, నూకాలు, కార్యదర్శి రజని, ఏపీఎం రాజుబాబు, ఏపీవో రాజు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే పాలన

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



పోలిపుట్టులో సంక్షేమ పథకాల అమలుపై గ్రామస్తులతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

ముంచంగిపుట్టు: దేశంలోనే మెరుగైన ప్రజల పాలనను జగనన్న ప్రభుత్వం అందిస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలో జోలాపుట్టు, పనసపుట్టు పంచాయతీల్లోని లబ్బూరు, పోలిపుట్టు, లుక్కురు, కడుతుల, పనసపుట్టు, టిక్రపడ గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే పాల్గుణ పర్యటించారు. గ్రామస్తులు ఆయనకు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో 437 గడపలను ఆయన సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలుతీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రజల చెంతకే సుపరిపాలన అందిస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచ్‌లు నోయిన, రమేష్, భాగ్యవతి, నీలకంఠం, గంగాధర్, ఎంపీటీసీలు కమల, సుబ్బలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు జగబందు, గాసిరావు, మూర్తి, తిరుపతి, దశరథ్, పిత్‌బాష్, సన్యాసి, వెంకట్, సురేష్, రాంప్రసాద్, పులిరాజు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ భూస్థాపితం కావడం తథ్యం



మాట్లాడుతున్న ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, నేతలు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎంపీపీ రంజపల్లి ఉషారాణి అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలన్నారు. భవిష్యత్‌లో టీడీపీ భూస్థాపితం కావడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారని, సరైన గుణపాఠం చెబుతారన్నారు. వైస్ ఎంపీపీ రామన్న, ఎంటీసీలు శత్రుగున్, రామచందర్, మాజీ ఎంపీపీ అరుణకుమారి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి శ్రీను, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు వెంకటరావు, నాయకులు శెట్టి అప్పాలు, రఘునాథ్, బాలరాజు, గులబీ, రామ్మూర్తి, దొన్ను, సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

వెండి పళ్లెం బహూకరణ



సాక్షి,పాడేరు: మోదకొండమ్మతల్లికి గాజువాకకు చెందిన దొడ్డి వెంకటరమణ అనే భక్తుడు వెండి పళ్లాన్ని బుధవారం బహూకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు రామారావు, సిబ్బంది వెండి పళ్లాన్ని స్వీకరించారు.

ఎంఈవోకు వినతి

గూడెంకొత్తవీధి: ఎంఈవో నాగభూషణంను ఉపాధ్యాయ సంఘాల నేతలు బుధవారం కలిశారు. జీవో నంబర్–117 రద్దు చేయాలని, ఫేష్ రికగ్నైజేషన్ అటెండెన్స్ మార్పు చేయాలని కోరారు. పెద్దబ్బాయి, సురేష్‌కుమార్ తదితరులున్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

చింతపల్లి : చింతపల్లి జూనియర్ కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎన్.శివకుమార్ చెప్పారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో సీట్లు ఖాళీలున్నాయని, అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ ఒకటో తేదీలోగా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

గ్రామస్తుల శ్రమదానం



గోతులు పూడుస్తున్న స్థానికులు

ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు నుంచి పెదబయలు రహదారిలో చోటముఖిపుట్టు గ్రామ సమీపంలో గల వంతెన వద్ద గోతులు ప్రమాదకరంగా మారాయి. తరచూ వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. సమస్యను అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామానికి చెందిన ప్రసన్న, అమర్, ఆచారి తదితరులు శ్రమదానంతో గోతులు పూడ్చే కార్యక్రమం చేపట్టారు. దీంతో వాహనచోదకులు, స్థానికులు వారిని అభినందించారు.

ఆర్‌బీకే సేవలు సద్వినియోగం చేసుకోవాలి

హుకుంపేట: సూకూరు పంచాయతీలోని రైతు భరోసా కేంద్రంలో కంప్యూటర్ సేవలను సర్పంచ్ సత్యవతి బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఆర్‌బీకేలలో ఈ–క్రాప్ నమోదు, ఈకేవైసీ తదితర సేవలందుతున్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

పశు వ్యాధులపై అప్రమత్తం

డుంబ్రిగుడ: కొర్రాయి పంచాయతీ కిమిలిగుడ, శాంతినగర్, గ్రామాల్లో బుధవారం 382 మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు వేసినట్టు పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి గౌతమ్ చెప్పారు. ఆయన మాట్లాడుతూ పశు వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తప్పనిసరిగా వేయాలన్నారు. మూగజీవాలకు వ్యాధులు సంభవిస్తే వెంటనే తమను సంప్రదించాలన్నారు. సిబ్బంది త్రినాథ్‌రావు, సంజీవ్, జయరాజు, అప్పారావు, అనంత్‌రావు, మనోజ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో నవీన్‌కు అభినందనలు



ఎంపీడీవో నవీన్‌ను అభినందిస్తున్న సిబ్బంది

పాడేరు రూరల్: ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన కె.సాయి నవీన్‌ను ఎంపీపీ రత్నకుమారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు బుధవారం ఘనంగా సన్మానించారు. గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నానిపాత్రుడు పాల్గొని అభినందనలు తెలిపారు.

పాఠశాల భవనం పనులు ప్రారంభం

జి.మాడుగుల: పాలమామిడి పంచాయతీలో ఎంపీపీ పాఠశాల భవన నిర్మాణ పనులను మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణ బుధవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పాఠశాల నిర్మాణానికి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి చొరవతో రూ.11.90లక్షల నిధులు మంజూరైనట్టు చెప్పారు. ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిదొర నాయకుడు కళ్యాణ్, హెచ్ఎం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే విజయం సొంతం

జి.మాడుగుల: బొయితిలి, నుర్మతి, బందవీధిలోని ఆశ్రమోన్నత పాఠశాలలను ఎంపీపీ కొర్రా పద్మ బుధవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే విజయం సొంతమవుతుందన్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని వినియోగించాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యుడు అప్పలరాజు, మాజీ సర్పంచ్ భీంబాబు పాల్గొన్నారు.

పోస్టుమాస్టర్ ఆనందరావుకు సన్మానం



పోస్టుమాస్టర్ ఆనందరావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

సాక్షి, పాడేరు : మినుములూరు బ్రాంచి పోస్టు మాస్టర్ బొడ్డేటి ఆనందరావు బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఆనందరావు దంపతులను వర్తక సంఘం నేతలు బుధవారం ఘనంగా సన్మానించారు. ఉప సర్పంచ్ రాము, గోపీ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

చింతపల్లి రూరల్: మండల కేంద్రంలోని సంత ప్రాంతంలో ఎస్ఐ మహమ్మద్ షరీఫ్ ఆలీ ఆధ్వర్యంలో బుధవారం వాహనాలు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

నాడు-నేడు కాంట్రాక్టర్‌పై కేసు

- పాఠశాల ఆకస్మిక తనిఖీల్లో బయటపడిన లోపాలపై ఎమ్మెల్యే ఆదేశం
- పనులు పూర్తి చేయకుండా బిల్లులు తీసుకోవడంపై ఆగ్రహం
- లబ్బూరు పీహెచ్‌సీ, ఆశ్రమ పాఠశాలలో తనిఖీలు


లబ్బూరు పాఠశాలలో నాడు నేడు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ

ముంచంగిపుట్టు: వైద్య సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని జోలాపుట్టు పంచాయితీ లబ్బూరు పీహెచ్‌సీని ఎమ్మెల్యే బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారి ప్రతాప్ సెలవు చీటీ పెట్టి కూడా ఆ రోజు సంతకం పెట్టి ఉండడం, కొంత మంది విధుల్లో నిర్లక్ష్యం వహించడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. సక్రమంగా విధులు నిర్వహించాలని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని, వైద్య సేవల విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం లబ్బూరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో జరిగిన నాడు నేడు పనులను పరిశీలించారు. పనులు సక్రమంగా జరగకపోవడం, చేసిన పనులు నాసిరకంగా ఉండడంపై హెచ్ఎం బాబురావును ఎమ్మెల్యే ప్రశ్నించగా కాంట్రాక్టర్, ట్రైబల్ వెల్ఫేర్ ఏఈఈ శ్రీకాంత్‌లు ఎన్ని సార్లు చెప్పినా వినకుండా పనులను ఇలా అసంపూర్తిగా వదిలేశారని బదులిచ్చారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే పాల్గుణ బిల్లులు తీసుకుని, పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్, ఏఈఈలపై కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఎంపీపీ సీతమ్మ, సర్పంచ్‌లు నీలకంఠం, నోయిన, గంగాధర్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

టీచర్ గైర్హాజరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

కొయ్యూరు: నిజం చెప్పకపోవడం అబద్ధం. అబద్ధాన్ని నిజం చేయాలనుకోవడం మోసం.. అతడు సినిమాలో మహేష్ బాబు డైలాగ్‌ను బంగారంపేట ప్రాథమిక పాఠశాల వంటమనిషి బాగా వంటబట్టించుకున్నట్టుంది. పాఠశాలకు రాని ఉపాధ్యాయుడిని వచ్చినట్టు, ఆరోగ్యం సరిగా లేక కాసేపు ఉండి వెళ్లినట్టు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి వద్ద బుకాయించబోయింది. మాయ తెలియని విద్యార్థులు మాత్రం నిజం చెప్పేశారు. దీంతో సదరు ఉపాధ్యాయుని అసలు బండారం బయటపడింది. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఎమ్మెల్యే బుధవారం బంగారంపేట స్కూల్‌ను పరిశీలించారు. ఆ సమయానికి పాఠశాలలో ఉపాధ్యాయుడు లేకపోవడంపై ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఉపాధ్యాయుడు వచ్చారని వంట మనిషి చెప్పగానే హాజరు పట్టికను తీసుకురమ్మని ఆదేశించారు. విద్యార్థులు హాజరు పట్టికను చూడగా, అందులో వచ్చినట్టు సంతకం లేదు. దీంతో ఉపాధ్యాయుడు రాకపోయినా వచ్చినట్టు.. ఎలా చెబుతారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇంతలో గ్రామానికి చెందిన సతీష్ అనే యువకుడు వచ్చాడు. ఉపాధ్యాయునికి ఆడిట్ ఉండడంతో రాలేదని ఎమ్మెల్యేకు చెప్పారు. అతనికి బదులుగా తనను బోధన చేయమని చెప్పినట్టు తెలిపాడు. వెంటనే ఈ యువకుడు మీకు పాఠాలు చెప్పారా? అని ఎమ్మెల్యే విద్యార్థులను ప్రశ్నిస్తే అతను కూడా పాఠశాలకు రాలేదని వారు సమాధానం చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే మరింత అసహనం వ్యక్తం చేశారు. సాయంత్రం వరకు విద్యార్థులకు బోధన చేయాలని, ఆమె యువకుడిని ఆదేశించారు. ఇదిలా ఉండగా 20 మంది విద్యార్థులున్నట్టు చూపిస్తున్నా, పాఠశాలకు ఏడుగురు మాత్రమే హాజరవడం గమనార్హం.


బంగారంపేట పాఠశాల్లో హాజరుపట్టికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఊటీ ఎస్సీ, ఎస్టీ స్టడీ టూర్‌లో ఎంపీ గొడ్డేటి


ఊటీలోని ఎస్సీ,ఎస్టీ సంక్షేమ కమిటీ సమావేశంలో పాల్గొన్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి

సాక్షి, పాడేరు : తమిళనాడులోని ఊటీలో జరుగుతున్న కేంద్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కమిటీ స్టడీ టూర్‌కు అరకు ఎంపీ గొడ్డేటి మాధవి హాజరయ్యారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి అమలు చేస్తున్న కార్యక్రమాలపై అక్కడి అధికారులతో కేంద్ర కమిటీ సమీక్షించింది. ఈ కమిటీలో ఎంపీ మాధవి తోపాటు, ఇతర ఎంపీలకు తమిళనాడు అధికార యంత్రాంగం ఘన స్వాగతం పలికింది.

రిజర్వ్ ఫారెస్ట్ వదిలి వస్తే సౌకర్యాలు కల్పిస్తాం

- జీలుగులోవ గ్రామస్తులతో ఉన్నతాధికారుల బృందం

రావికమతం: జీలుగులోవ గ్రామస్తులకు కనీస సౌకర్యాలు అందడం లేదని ఆ దిశగా చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ కొన్న ప్రజా సంఘాల నాయకులిచ్చిన ఫిర్యాదు మేరకు చర్యలు ప్రారంభమయ్యాయి. మానవ హక్కుల కమిషన్ ఆదేశాలతో ఆ గ్రామాన్ని గత నెల 27న అధికార్ల బృందం సందర్శించారు. అయితే అక్కడ 6 కుటుంబాలే ఉండటం, పైగా దారి తెన్నూ లేని రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉండటంతో రోడ్డు, విద్యుత్, మంచి నీటి సౌకర్యాలనికి కేంద్ర అటవీ అనుమతులు కష్టమవుతాయని, కిందికి వస్తే సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీనిపై ఆలోచించుకోవడానికి ఆ గిరిజనులకు 20 రోజులు గడువిచ్చిన విషయం తెలిసిందే. దీనిపై గ్రామస్తుల నిర్ణయాన్ని తెలుసుకునేందుకు నర్సీపట్నం ఆర్డీవో బీహెచ్ భవానీశంకర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శిరీషా రాణి, స్థానిక ఐసీడీఎస్ పీవో ఉషా రాణి, తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు కళ్యాణపులోవ గ్రామంలో బుధవారం సమావేశం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఒంజరి గంగరాజు, ఎంపీటీసీ చిన్ని చిన్నమ్మలు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆ గ్రామస్తులకు కొన్ని సూచనలు చేశారు. జి.మాడుగుల పరిధిలో ప్రస్తుతం ఉన్నందున అక్కడ పథకాలు వర్తించేలా చేస్తామని, అలా అయితే ఐటీడీఏ పరిధిలోకి వెళ్తారని, పిల్లల భవిష్యత్ కూడా బాగుంటుందని సూచించారు. లేదా జీలుగులోవ కొండ దిగివస్తే బంగారుబందల–కళ్యాణపులోవ గ్రామం మధ్యలో స్థలం కేటాయించి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, నిర్ణయం చెప్పాల్సిందిగా గ్రామస్తులకు సూచించారు. ఆ గ్రామ గిరిజనులు సీదిరి వెంకట్రావు, కొర్రా గాసన్న, రాజు, మహేష్ తదితరులు తామంతా కిందికి దిగి వచ్చేస్తామని, బంగారుబందల వద్ద ఇంటి స్థలం, సౌకర్యాలుతో పాటు అందరికీ రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు కల్పించాలని కోరారు. దీంతో వారి నుంచి స్టేట్‌మెంట్ రికార్డ్ చేసి ఆ నివేదికను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే న్యాయం చేస్తామని అధికారుల బృందం గ్రామస్తులకు హామీ ఇచ్చింది.


జీలుగులోవ గిరిజనులతో మాట్లాడుతున్న ఆర్డీవో భవాని శంకర్ తదితరులు

కాగిత రైతులతో జేసీ భేటీ

- ఎకరాకు రూ.80 లక్షలు కోరిన నిర్వాసితులు

నక్కపల్లి: జాతీయ రహదారి నుంచి చందనాడ వరకు ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణంలో భాగంగా కాగిత గ్రామం మీదుగా ఏర్పాటు చేస్తున్న రోడ్డు కోసం భూములు కోల్పోయినవారికి ఎకరాకు రూ.80 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరారు. అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో కాగిత రైతులు, నిర్వాసితులతో జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం కోసం కాగిత పరిధిలో సుమారు 10 ఎకరాలు సేకరిస్తున్నారన్నారు. బహిరంగ మార్కెట్లో భూమి విలువ ఎకరాకు రూ.80 లక్షలుపైనే ఉందన్నారు. ఈ మొత్తాన్ని నష్టపరిహారంగా చెల్లించాలని కోరారు. అంతమొత్తం సాధ్యం కాదని ఎకరాకు రూ.45 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు చెల్లించేందుకు ప్రయత్నిస్తామని జేసీ తెలిపారు. ఈ పరిహారం చెల్లిస్తే రైతులు నష్టపోతారని నిర్వాసితులు పేర్కొన్నారు. కలెక్టర్‌కి, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిహారం పై మరోసారి నిర్వాసితులతో చర్చలు జరపనున్నట్టు జేసీ వెల్లడించారు. ఈ సమావేశంలో ఎస్‌డీసీ అనిత, తహసీల్దార్ సుబ్రహ్మణ్యశాస్త్రి, రైతుల తరఫున కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ, సర్పంచ్ పోతంశెట్టి రాజేష్, తళ్ల రోహిణీభార్గవ్, సురేష్‌వర్మ, రైతులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో తిరుగుబాటు

శతాబ్ది ఉత్సవం


అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్‌పై విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు దండెత్తి నేటికి నూరేళ్ళు పూర్తయిన సందర్భంగా స్టేషన్ ఆవరణలో బుధవారం తిరుగుబాటు శతాబ్ది ఉత్సవం నిర్వహించారు. మన్యం విప్లవం పుట్టిన రోజు అంటూ అల్లూరి అభిమానులు, అధికారులు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అల్లూరి సీతారామరాజు జాతీయ సేవాసంస్థ వ్యవస్థాపకులు దుళ్ళ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బ్రిటీష్ పాలనలో ప్రజలు అనుభవించిన బాధలు వర్ణనాతీతం అన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ బ్రిటీషు వారిపై దేశం నలుమూలలా తిరుగుబాట్లు జరిగాయన్నారు. ఆ తిరుగుబాట్లకు, అల్లూరి నాయకత్వంలో జరిగిన మన్యం విప్లవ పంథాకు ఎంతో తేడా వుందన్నారు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అన్నది శాంతియుతంగా, అహింసా మార్గంలో ప్రాథేయపడితే వచ్చేది కాదని అల్లూరి భావించారన్నారు. నేతాజీ మాదిరి సాయుధ పోరాటాన్ని ఎంచుకున్న అల్లూరి ఆయుధాల కోసం వరుసగా చింతపల్లి, కేడీ పేట, రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్లపై దండెత్తి ఆయుధాలను దోచుకున్న సంఘటనలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై గోపీ నరేంద్రప్రసాద్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సరకుల నాణ్యతలో తేడా ఉంటే చర్యలు

- శాంపిల్స్ ప్రకారమే నిత్యావసరాలు సరఫరా
- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి,పాడేరు : పాడేరు ఐటీడీఏ పరిధిలోని అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలకు నాణ్యమైన నిత్యావసర సరకులను పంపిణీ చేయాలని, లేనిపక్షంలో ఆయా టెండరుదారులు, కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టి, చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ హెచ్చరించారు. బుధవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో జీసీసీ ఆధ్వర్యంలో నిత్యావసర సరకుల సరఫరా నిమిత్తం నిర్వహించిన టెండర్లలో పీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెండర్ల సమయంలో ఇచ్చిన శాంపిల్స్ ప్రకారమే ఆయా నిత్యావసర సరుకులను సరఫరా చేయాలన్నారు. ఎక్కడ అక్రమాలు జరిగినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కూరగాయలు, పాలు, గుడ్లు, పెరుగు సరఫరా పక్కాగా ఉండాలన్నారు. ఆశ్రమ పాఠశాలల హెచ్ఎంలు, డిప్యూటీ వార్డెన్‌గా అదనపు విధులు నిర్వహించడానికి వీల్లేదన్నారు. ఈ మేరకు వెంటనే సర్క్యులర్ జారీ చేయాలని గిరిజన సంక్షేమ డీడీని ఆదేశించారు. ప్రతి మూడు నెలలకోసారి డిప్యూటి వార్డెన్‌ను మార్చి అర్హులైన మరొక ఉపాధ్యాయునికి బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ డీడీ ఐ.కొండలరావు, జీసీసీ డీఎం కురుసా పార్వతమ్మ, అన్ని మండలాల ఏటీడబ్ల్యూవోలు, జీసీసీ మేనేజర్లు పాల్గొన్నారు.

త్వరితగతిన పెట్రోల్ బంకుల నిర్మాణం

సాక్షి, పాడేరు: పెట్రోల్ బంకుల నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్, హెచ్‌పీసీఎల్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తగా ఏజెన్సీకి ఆరు పెట్రోల్ బంకులు మంజూరయ్యాయన్నారు. అరకులోయలో పానిరంగిని, పాడేరులోని తలారిసింగి, ముంచంగిపుట్టులోని లుంగాపుట్టు, అనంతగిరి మండల కేంద్రంలోను, కొయ్యూరులోని నడింపాలెం, చింతపల్లిలోని తాజంగి గ్రామాల్లో హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకులు నిర్మాణాలు చేపడుతున్నట్టు చెప్పారు. అరకులోయలోని పానిరంగిని పెట్రోల్ బంకు పనులు వచ్చేనెల 15 నాటికి, పాడేరు, ముంచంగిపుట్టు మండలాల్లోని బంకులు అక్టోబర్ 15 నాటికి పూర్తి చేయాలన్నారు. తాజంగి, అనంతగిరి, కొయ్యూరు మండలాల్లో బంకులను నవంబర్ 1వ తేదీ నాటికి పూర్తి చేసే లక్ష్యంతో అధికారులు పని చేయాలని పీవో సూచించారు. విద్యుత్ సదుపాయానికి సంబంధించిన ప్రతిపాదనలను ట్రాన్స్‌కో అధికారులకు అందజేయాలని, ఈ పెట్రోల్ బంకుల నిర్మాణాల్లో ఎలాంటి సాంకేతిక సమస్యలున్నా.. తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు.